భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

పోచారం: వ్యవసాయానికి అనుకూలంగాలేని భూములను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. పోచారంలోని 35, 37, 38, 39, 40, 60, 61 సర్వే నెంబర్లు, యంనంపేట్‌లోని 121 సర్వే నెంబర్‌లోని భూములల్లో ఏమేరకు పంటలు పండుతున్నాయో స్వయంగా తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆర్డీఓ సైదులు, ఘట్‌కేసర్ తహసీల్దార్ రజిని తదితరులు పాల్గొన్నారు.

నియామకం

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ధర్మకర్తలను దేవాదాయశాఖ నియమించింది. ధర్మకర్తలుగా లక్ష్మీనారాయణ, ఎల్లెంకి భారతి, హరిగోపాల్, మురళీగౌడ్, హరికృష్ణ, భీమిడి నీలం సంజీవరెడ్డి, జగదీష్‌గౌడ్‌లను నియమిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

అబ్కారీ శాఖ ఎస్సీ ఉద్యోగుల అడ్‌హక్ కమిటీ ఏర్పాటు



పోచారం: తెలంగాణ రాష్ట్ర అబ్కారీ శాఖ ఎస్సీ ఉద్యోగుల సమావేశం అన్నోజిగూడలోని తులిప్స్ హోటల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్, కరీంనగర్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్, వరంగల్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్ నేతృత్వం వహించారు.

ఘనంగా కుడారై వేడుకలు



ఘట్‌కేసర్: ధనుర్మాసం పురస్కరించుకొని ఎదులాబాద్ శ్రీ గోదా సమేత శ్రీ రంగనాయక్ స్వామి ఆలయంలో కుడారై వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున పూజల అనంతరం తిరుప్పావై వినిపించారు. వేయి గంగాళాలలో పాయసం నింపి భక్తులకు అందజేశారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించారు. పూజల్లో ఆలయ ధర్మకర్తలు లక్ష్మణాచార్యులు, రాజగోపాలాచార్యులు, అనంతసేనాచార్యులు, పురుషోత్తమాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవాత్సవాచార్యులు, శ్రీపతిచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అభినందనలు



కీసర: నాగారం మున్సిపాలిటీ బీజేపీ నూతన అధ్యక్షులుగా నియమితులైన కొండబోయిన నాగరాజును శనివారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు శ్యాంసుందర్‌శర్మ, సురేష్, వేణు, కౌకుట్ల రాహుల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వామన్, సాయికిరణ్, గణేష్, నరేందర్, సుమన్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొండబోయిన నాగరాజు మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీలో బీజేపీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

కుచించుకుపోతున్న నాలాలు



ముత్వెల్లిగూడలో నాలా వెంబడి పోసిన మట్టి కుప్పలు

పోచారం: వర్షపు నీటితో పాటు వ్యర్థ జలాలు సాఫీగా ప్రవహించాలంటే నాలాలు, కాల్వలు తగినంత వెడల్పు ఉండాలి. అలాంటి నాలాలు, కాల్వలు కుచించుకుపోతే ప్రజలు పడాల్సిన ఇబ్బందులు అంతా ఇంతా కాదు. బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. నాలాలు, కాల్వల వెడల్పు తగ్గితే బఫర్ జోన్‌తో పాటు సెట్ బ్యాక్‌లు తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో నాలాల వెడల్పును తగ్గించేందుకు పరీవాహక ప్రాంతంలో వెంచర్లు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు పనాగాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా నాలా కట్టలపై రాళ్లు, మట్టి పోస్తూ క్రమంగా నాలా వెడల్పును కుచించేస్తున్నారు.

ఎర్రిమల్లి వాగులో...

గతంలో యంనంపేట్‌లోని ఎర్రిమల్లి వాగులో పలు చోట్ల రాళ్లు, రప్పలు వేశారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఇర్రిగేషన్ అధికారులు పరిశీలించి పూడికలు తీయిస్తామని చెప్పారు. అయినప్పటికీ అధికారుల హామీలు కార్యరూపం దాల్చలేదు.

మీర్కాన్ కుంటలో పూడికలు...

బతుకమ్మ ఘాట్ ఏర్పాటు చేసేందుకు అన్నోజిగూడలోని మీర్కాన్ కుంటలో సుమారు 2 వేల చదరపు గజాల విస్తీర్ణంలో వెయ్యి లారీలకు పైగానే మట్టిని పోయించి చదును చేశారు. పూడికలపై ఫిర్యాదులు రావడంతో ఇర్రిగేషన్ అధికారులు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. మట్టిని తొలగించాలని పోచారం మున్సిపల్ కమిషనర్‌కు ఇర్రిగేషన్ శాఖ అధికారులు లిఖితపూర్వకంగా కోరారు. అంతేకాకుండా పోచారం పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఇదంతా జరిగి సుమారు ఏడాది అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

నాలా పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కట్ట వెంబడి మట్టి కుప్పలు పోసిన వ్యక్తులను గుర్తించి నోటీసులు ఇస్తాం. వర్షపు నీరు, వ్యర్థ జలాలు సాఫీగా ప్రవహించేలా చేస్తాం.

– పరమేష్, ఏఈ, ఇర్రిగేషన్ శాఖ

ముత్వెల్లిగూడలో నాలా వెంబడి మట్టి గుట్టలు..

ఇటీవల కాచివానిసింగారం గ్రామ పరిధిలోని ముత్వెల్లిగూడలో ఉన్న నాలా వెంబడి మట్టి గుట్టలు పోశారు. నాలాకు ఆనుకొని వెంచర్లు వస్తున్నాయి. బఫర్ జోన్‌లోనూ రోడ్లు నిర్మిస్తున్నారు. వ్యవసాయానికి కావాల్సిన నీరు ఈ నాలా ద్వారానే వస్తోంది. ఈ నీటిని వినియోగించుకొని కొందరు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. నాలాలల్లో పూడికలను తీయించడంతో పాటు సాధ్యమైనంత మేరకు వెడల్పును పెంచాలని పలువురు కోరుతున్నారు.

పట్టణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో రూ. 2.3 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ పావనీజంగయ్యతో కలిసి శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న 6 గ్యారెంటీలు దేశంలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధా, సుల్తానా, నాగజ్యోతి, శశికళ, మల్లేష్, పద్మారావు, కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

శామీర్‌పేట్: మట్టి తరలింపు విషయంలో చోటుచేసుకున్న గొడవలో వ్యక్తిపై దాడి జరిగిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, కండ్లకోయలోని ఐటీ పార్క్ పనుల్లో భాగంగా బెంగుళూరుకు చెందిన ఓ కంపెనీ మట్టి తరలింపు టెండర్‌ను పొందింది. ఆ కంపెనీ తరలింపును స్థానికంగా ఉండే గంగాధర్ సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఆనంద్ టిప్పర్లలో మట్టి నింపే విషయంలో గొడవ తలెత్తగా.. గంగాధర్ తన అనుచరులతో కలిసి ఆనంద్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా మట్టితరలింపు విషయంలో మైనింగ్‌శాఖ అనుమతి లేనట్టు తెలిసింది. బాధితుడి కుటుంబీకులు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో వడ్డెర సంఘం అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ శాంతి హాజరై కేక్ కట్ చేసి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైరా నర్సింహారెడ్డి వద్ద సైన్య అధ్యక్షుడిగా పనిచేసిన వడ్డె ఓబన్న స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కుతాడి సాయి, పల్లపు రవి, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, నాయకులు మల్లేశం, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో 'ఉద్యాన్ ఉత్సవ్'

శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మైసమ్మగూడలోని సేయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం రాష్ట్రపతి నిలయంను సందర్శించారు. 'ఉద్యాన్ ఉత్సవ్' కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయంలోని రాక్ గార్డెన్స్, ప్రధాన భవనం, భారతజెండా, కిచెన్ టన్నెల్, సేంద్రీయ వ్యవసాయం, అర్బన్ ప్లాంటేషన్‌లను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ టివి రెడ్డి, డైరెక్టర్ సరోజరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, పీఆర్వో రవి సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



నాగారం సెరినిటీ పాఠశాలలో.. సంబరాలు



నాగారం మున్సిపల్‌లో.. విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న కౌన్సిలర్ మమతకృష్ణారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం ఉదయం కౌన్సిలర్ కౌకుట్ల మమతాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చక్కటి ముగ్గులు వేసిన విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

నాగారం సెరినిటీ పాఠశాల్లో..

నాగారం సెరినిటీ పాఠశాల్లో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. చక్కటి ముగ్గులు, గొబ్బెమ్మలు, గాలిపటాలు, మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా చిన్నారుల వేషధారణ పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కార్యదర్శి నోముల వసంత తదితరులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసరలో అరుందతీపాఠశాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్న, ఉపాధ్యాయులు ప్రతిమ, బిందు, వీణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్: మేడ్చల్ మండలంలో పలు పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. మేడ్చల్‌లోని ఎస్.కె.ఎం ఉన్నత పాఠశాల, విభా స్కూల్‌లలో సంక్రాంతి సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు.



కీసరలో..



విభా స్కూల్‌లో..



ఎస్.కె.ఎం స్కూల్‌లో..

తుది దశకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సాక్షి,సిటీబ్యూరో: సొంత స్థలమున్న ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దరఖాస్తుల పరిశీలన (సర్వే) కార్యక్రమం మేడ్చల్ జిల్లాలో తుది దశకు చేరుకుంది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1,43,267 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 1,32,968 దరఖాస్తులకు సంబంధించిన సర్వే (పరిశీలన) కార్యక్రమం పూర్తయింది. సంక్రాంతి లోపు మిగతా దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తికానుండటంతో.. మరో రెండు దశల్లో సర్వే టీమ్‌లు పరిశీలించిన దరఖాస్తులను పర్యవేక్షించి, అర్హులైన లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేయనున్నట్లు సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

13 పురపాలికలు, 34 జీపీల్లో 450 టీమ్‌లు

జిల్లా వ్యాప్తంగా నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థలు, దుండిగల్, కొంపల్లి, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, నాగారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్, పోచారం, తూముకుంట మున్సిపాలిటీలతోసహా 34 గ్రామ పంచాయతీల నుంచి అందిన 1.43 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి 450 టీమ్‌లు నిరంతరంగా పని చేస్తున్నాయి. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం డిసెంబర్ నెలాఖరు వరకు పూర్తి కావాల్సిన్నప్పటికీ, డోర్‌లాక్, దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవటంతోపాటు పలు ఏరియాల్లో ఫోన్ సిగ్నల్ సమస్య కారణంగా సంక్రాంతి వరకు సర్వే కార్యక్రమాన్ని కొనసాగించాల్సి వస్తోందని గృహనిర్మాణ శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

గత లబ్ధిదారులపై ఆరా..

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధి పొందారా అనే విషయం సర్వే యాప్‌తో తెలిసిపోతున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఉంటున్న ఇంటి వివరాలు, గదులు, కుటుంబ సభ్యుల వివరాలు తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం ఉందా? ఉంటే వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు, లేకపోతే ఇంటిపన్ను రసీదు, కరెంటు బిల్లు తదితర పత్రాలను స్కానింగ్ చేస్తున్నారు. దరఖాస్తుదారుడి ఫొటోతో పాటు ఇంటి స్వరూపానికి సంబంధించిన మూడు చిత్రాలు తీస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు కుమారులు పెళ్లి చేసుకుని, ఒకే ఇంట్లో వేర్వేరుగా నివాసముంటున్న వారు ముందే దరఖాస్తు చేసుకుని ఉంటే వారికి అదే స్థలంలో వేర్వేరుగా సర్వే చేస్తున్నారు.

వేగవంతానికి గృహనిర్మాణ శాఖ పునరుద్ధరణ

ఇందిరమ్మ పథకం కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వేగవంతం కోసం జిల్లా గృహనిర్మాణ శాఖకు మళ్లీ పునరుద్ధరించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహానిర్మాణ శాఖను రద్దు చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో గత బీఆర్‌ఎస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖలు పర్యవేక్షించాయి. దివంగత నేత వైఎస్ఆర్ ప్రభుత్వం హయాంలో గృహానిర్మాణ శాఖ చేపట్టిన ఇందిరమ్మ పథకం విజయవంతం కావటంతో.. రద్దు అయిన గృహానిర్మాణ శాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించింది. దీంతో మేడ్చల్ జిల్లాకు గృహానిర్మాణ శాఖ పీడీగా రమణమూర్తిని నియమించిన సర్కారు ముగ్గురు డీఈఈలతో సహా ఇద్దరు ఏఈలను కూడా నియమించింది.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి



డీపీఎస్ వార్షికోత్సవంలో నృత్యకారులతో ముఖ్య అతిథులు, చైర్మన్, డైరెక్టర్లు

ఘట్‌కేసర్: విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవరచాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో నిర్వహించిన 6వ వార్షికోత్సవం వేడుకలకు డీఆర్‌డీఏ శాస్త్రవేత్తతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సమాజ సేవ దృక్పదం పెంపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్‌లో నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్లు విజయపాల్‌రెడ్డి, రాధికరెడ్డి, పాలక మండలి సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపడుతున్న సీ.ఐ వెంకటయ్య

కీసర: కీసరలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని సీ.ఐ వెంకటయ్య అన్నారు. శనివారం మధ్యాహ్నం కీసర చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో స్వయంగా రంగంలోకి దిగిని సీ.ఐ తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులకు వాహనదారులు సహకరించాలన్నారు. అదే విధంగా పండుగ సందర్భంగా స్వంత ఊర్లకు వెళ్లే వారు ఇంట్లో నగదును, విలువైన వస్తువులు, ఉంచవద్దన్నారు. ఊరికెళ్లే వారు స్థానిక పోలీస్ మొబైల్ టీమ్‌కు సమాచారం ఇవ్వడం వల్ల రాత్రి వేళ్లలో ఆ కాలనీల్లో గస్తి నిర్వహించడానికి వీలుంటుందన్నారు.

పండగకు పస్తులేనా..?

- మూడు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు
- సంక్రాంతికైనా జీతాలు ఇవ్వాలని వేడుకుంటున్న కార్మికులు



వేతనాల కోసం నిరసన చేపట్టిన అవుట్ సోర్సింగ్ కార్మికులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు సంక్రాంతి పండుగకు పస్తులుండవలసిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ కేర్, ఆయాలు, సెక్యూరిటీగా వీరే విధులు నిర్వహిస్తుంటారు. ఆసుపత్రిలో పనులు నిర్వర్తించడానికి ప్రభుత్వం శ్రీ సాయి సెక్యూరిటీ సంస్థకు కాంట్రాక్టుకు ఇచ్చింది. మెయిన్ కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్‌కు నిర్వాహణ బాధ్యతలు అప్పగించాడు. కాని కార్మికులకు సబ్ కాంట్రాక్టర్ అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెల వేతనాలు చెల్లించలేదు. క్రిస్మస్ పండుగకు ఇవ్వాలని కోరిన ఫలితం లేకుండా పోయింది. తెలంగాణలో పెద్ద పండుగ సంక్రాంతిని ఘనంగా నిర్వహించుకోవాలనుకున్న కార్మికుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 21 మంది విధులు నిర్వహిస్తుండగా జిల్లాలో వందలాది మంది విధులు నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని కాంట్రాక్టర్...

కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారమై కొట్టుమిట్టాడుతున్నారు. చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో నానా అగచాట్ల పడుతున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాల్సిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్, కాంట్రాక్టర్‌ను సంప్రదించాలని యత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదు.





విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న, తోటకూర వజ్రేష్‌యాదవ్, తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కీసర: క్రీడలు శారీరక దారుడ్యంతోపాటు, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర జంగయ్యయాదవ్ అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ కుందన్‌పల్లిలోని తెలంగాణ సగర యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను పొత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సగర సంఘం నేతలు, యువజన నేతలు తదితరులు పాల్గొన్నారు.